క్లుప్తంగా

ఈ క్రాప్ నమోదు తప్పనిసరి



చాట్రాయి: ప్రతి రైతు తమ పంటలను తప్పనిసరిగా ఈ క్రాప్ చేయించుకోవాలని వ్యవసాయ అధికారి బి.శివశంకర్ తెలిపారు. శనివారం చాట్రాయిలో ఈ క్రాప్ నమోదును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతు వేసిన పంట పేరు, వరి రకం సర్వే నంబర్ చెప్పి ఈ క్రాప్ చేయించుకోవాలన్నారు. ఈ క్రాప్ నమోదుతో ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టం వాటిల్లితే నష్ట పరిహారం లభిస్తుందన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని, బీమా సౌకర్యం ప్రభుత్వం కల్పిస్తుందని ఆయన చెప్పారు. ఆయా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో సిబ్బందిని సంప్రదించాలని ఆయన కోరారు.

తెలుగు సాహిత్యంపై క్విజ్ పోటీలు



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): తెలుగు వారోత్సవాల్లో భాగంగా కొండపల్లి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో తెలుగు సాహిత్యంపై విద్యార్థులకు క్విజ్ పోటీలు శనివారం నిర్వహించారు. 6వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు పది గ్రూపులు క్విజ్‌లో పాల్గొన్నారు. క్విజ్‌లో ఉత్తమ ప్రతిభ చాటిన తొలి ముగ్గురికి బహుమతులను గిడుగు రామ్మూర్తి జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవం రోజున అందజేస్తామని పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం శ్రీనివాసరావు తెలిపారు. ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆహా క్యాంటీన్ ప్రారంభం




తిరువూరు: స్థానిక నగర పంచాయతీ కార్యాలయం వద్ద ఆహా క్యాంటీన్‌ను శనివారం చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి ప్రారంభించారు. ప్రారంభోత్సవం సందర్భంగా ఉదయం అల్పాహారం ఉచితంగా సరఫరా చేస్తారు. మధ్యాహ్న భోజనం కూడా త్వరలో అందజేస్తామని చైర్‌పర్సన్ తెలిపారు. మెప్మా పొదుపు సంఘాల మహిళలు ఈ క్యాంటీన్‌ను సమర్థవంతంగా నిర్వహించి తక్కువ ధరకు అల్పాహారం, భోజనం పేదలకు అందే విధంగా చూడాలని సూచించారు. వైస్ చైర్‌పర్సన్లు విజయలక్ష్మి, కోటేశ్వరి, మెప్మా సీఈవో ప్రసాద్, పొదుపు సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

'ఆడుదాం-ఆంధ్రా' విజయవంతం చేయాలి



గంపలగూడెం: రాష్ట్ర ప్రభుత్వ ఆడుదాం-ఆంధ్రా కార్యక్రమం విజయవంతానికి వ్యాయామ ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది కృషి చేయాలని ఎంపీడీఓ వై.పిచ్చిరెడ్డి తెలిపారు. కార్యక్రమం నిర్వహణపై గంపలగూడెం మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామ, మండల, డివిజన్, జిల్లాస్థాయిలో జరిగే కబడ్డీ, ఖో-ఖో, బాల్‌బ్యాడ్మింటన్, వాలీబాల్, క్రికెట్ పోటీలను 38 రోజులపాటు నిర్వహిస్తామన్నారు. ఆయా పోటీల్లో ఉత్సాహవంతులు తమ గ్రామ సచివాలయాల్లో ముందుగా పేర్లు నమోదు చేసుకొనేలా ప్రోత్సహించాలన్నారు. విజేతలు తదుపరి స్థాయి పోటీలో పాల్గొంటారన్నారు. మండలంలోని పలు హైస్కూళ్ల పీఈటీలు పాల్గొన్నారు.

31న గిరిప్రదక్షిణ



మెట్టగుట్ట/పెనుగొలను(గంపలగూడెం): గంపలగూడెం మండలం పెనుగొలను శివారు మెట్టగుట్టపై విరాజిల్లుతున్న శ్రీశేషాచల శ్రీనివాసస్వామి సన్నిధిలో శ్రావణ పౌర్ణిమ సందర్భంగా ఈ నెల 31వ తేదీన గిరిప్రదక్షిణను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు జొన్నల ప్రతాపరెడ్డి తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి ఛత్ర, చామర, మంగళ వాయిద్యాలతో స్వామి గిరిప్రదక్షిణ కొనసాగుతుందన్నారు. ఆలయంలో తొలిసారిగా గిరిప్రదక్షిణ నిర్వహిస్తున్నారు. ఇకపై ప్రతి ఏటా శ్రావణమాసం పౌర్ణిమ రోజు గిరి ప్రదక్షిణ కొనసాగిస్తామన్నారు. అదే రోజు మధ్యాహ్నం భక్తులకు అన్నదానం గావిస్తామన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

జడ్జీలు షేక్ పెద ఖాసిం, హరిబాబు



నూజివీడు ట్రిపుల్ ఐటీలో నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి షేక్ పెద ఖాసిం

నూజివీడు: విద్యార్థులందరూ చదువుతో పాటు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని నూజివీడు సీనియర్ సివిల్ జడ్జి షేక్ పెద ఖాసిం పేర్కొన్నారు. పట్టణంలోని ట్రిపుల్ ఐటీలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి జడ్జి మాట్లాడుతూ.. ప్రతి పౌరుడు చట్టాలకు లోబడే జీవనం సాగించాలన్నారు. చట్టాల గురించి తెలుసుకోవడంతో పాటు బాధ్యతలను సైతం గుర్తెరిగి ఆదర్శవంతమైన పౌరుడిగా నడుచుకోవాలని చెప్పారు. సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులతో స్నేహపూర్వకంగా మెలగాలన్నారు. ర్యాగింగ్ చట్టప్రకారం నేరమని స్పష్టం చేశారు. విద్యార్థులు కేవలం చదువుపైనే దృష్టి సారించి, సెల్‌ఫోన్‌కు, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. చక్కగా చదువుకొని తల్లిదండ్రులకు, చదువుకున్న విద్యాసంస్థకు పేరు తీసుకురావాలని చెప్పారు. కార్యక్రమానికి డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ ఎస్వీ వెంకట్రావు అధ్యక్షత వహించగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇందుపల్లి సత్యప్రకాష్, సెక్రటరీ మధురవిశంకర్, న్యాయవాదులు సీహెచ్ తేజచంద్, కేబీ సీతారామ్, ఫ్యాకల్టీ, విద్యార్థులు పాల్గొన్నారు.

సబ్‌జైలును సందర్శించిన జడ్జి

నూజివీడు: పట్టణంలోని సబ్‌జైలును రెండో అదనపు జూనియర్ సివిల్‌జడ్జి కె.హరిబాబు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా రిమాండ్ ఖైదీలకు కల్పిస్తున్న సౌకర్యాలు, అందుతున్న ఆహారం తదితర విషయాలను జడ్జి ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. ఖైదీల హక్కులు, విధులను వారికి వివరించారు. ఎవరైనా న్యాయవాదిని పెట్టుకునే స్థోమత లేకుంటే ఆ విషయాన్ని కోర్టుకు దరఖాస్తు ద్వారా తెలియజేస్తే న్యాయ సేవాధికార సంస్థ వారికి ఉచితంగా న్యాయ సాయాన్ని అందిస్తుందన్నారు. నేరాలు చేయడం వల్ల వారి భవిష్యత్, వారిపై ఆధారపడిన కుటుంబ సభ్యుల భవిష్యత్ దెబ్బతింటుందన్నారు. ఈ నేపథ్యంలో ఆలోచనా విధానాన్ని మార్చుకొని జీవనం సాగించాలని సూచించారు. జడ్జి వెంట సబ్‌జైలు సూపరింటెండెంట్ ప్రసాద్ తదితరులు ఉన్నారు.



ఖైదీలతో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి హరిబాబు

9న జాతీయ లోక్ అదాలత్



తిరువూరు: జాతీయ లోక్ అదాలత్‌ను సెప్టెంబర్ 9వ తేదీన తిరువూరు కోర్టు ఆవరణలో నిర్వహిస్తున్నట్లు మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జడ్జి మోతీలాల్ నాయక్ తెలిపారు. న్యాయవాదులు, పోలీసులకు లోక్ అదాలత్ ఏర్పాట్లపై కోర్టు హాలులో శనివారం సమావేశం నిర్వహించారు. రాజీ చేసుకోదగిన కేసులను ఈ అదాలత్‌లో పరిష్కరించుకునే అవకాశం ఉన్నందున సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కక్షిదారులకు అదాలత్‌పై అవగాహన కల్పించాలన్నారు. పోలీస్, ఎక్సైజ్ తదితర శాఖల అధికారులు కూడా అదాలత్ విజయవంతం అయ్యేందుకు సహకరించాలని జడ్జి కోరారు. అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బడేమియా, బార్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సంకురాత్రి జనార్దనరావు, అంకిరెడ్డి అంజన్‌రెడ్డి, న్యాయవాదులు, పోలీసులు పాల్గొన్నారు.

పాడి రైతులకు బోనస్ పంపిణీ

రెడ్డిగూడెం: కృష్ణామిల్క్ యూనియన్ అందిస్తున్న సేవలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని బోర్డు డైరెక్టర్ ఉయ్యూరు అంజిరెడ్డి తెలిపారు. కొత్తరెడ్డిగూడెం పాల ఉత్పత్తిదారుల పరస్పర సహకార సంఘం నందు పాడి రైతులకు రూ.2,99,750ల బోనస్‌ను అందజేశారు. బోర్డు డైరెక్టర్లు ఏ.జమలారెడ్డి, శ్రీనివాసరెడ్డి, టి.ఓబుల్‌రెడ్డి, జి.వాణి, నాగమ్మ, జి.నరసింహారెడ్డి, పాడి రైతులు పాల్గొన్నారు.

నేడు ఉచిత మెగా వైద్యశిబిరం

విస్సన్నపేట: స్థానిక ఎ కొండూరు రోడ్డులోని జీవీఆర్ హెల్త్ కేర్ సెంటర్ రెండో వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు కిడ్నీ వైద్య నిపుణులు డాక్టర్ జి.అన్వేష్ శనివారం తెలిపారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జరిగే వైద్యశిబిరంలో కంటి, ఎముకల, చర్మ, గుండె వైద్య నిపుణులు డాక్టర్లు హారిక, పవన్‌కుమార్, ఉదయ శర్వాణి, రఘురామ్ పాల్గొని పరీక్షలు నిర్వహిస్తారన్నారు. రూ.3 వేలు విలువ చేసే వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తామని చెప్పారు. వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగించు కోవాలన్నారు.

దోమల నివారణకు ఎబేట్ పిచికారీ

చెవిటికల్లు(కంచికచర్ల): మండలంలోని చెవిటికల్లు గ్రామంలో సర్పంచ్ బుడ్డి విజయలక్ష్మి శనివారం దోమల నివారణకు ఎబేట్‌ను పిచికారీ చేయించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు మంగిశెట్టి పుల్లారావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు బుడ్డి సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి కనగాల రవికుమార్ పాల్గొన్నారు.

గొప్ప మానవతామూర్తి మదర్ థెరిస్సా



నివాళులర్పిస్తున్న రమేష్‌బాబు, రవీంద్రరెడ్డి



నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

తమైలవరం: మదర్ థెరిస్సా గొప్ప మానవతామూర్తి అని, ఎంతో మంది జీవితాల్లో వెలుగులు నింపి అసంఖ్యాక ప్రజలకు స్ఫూర్తిగా నిలిచారని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆమె జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రపంచవ్యాప్తంగా నిరుపేదలు, నిస్సహాయకులు, అత్యంత బలహీనులకు సేవ చేయడానికి తన జీవితాన్ని అంకితం చేశారన్నారు. మదర్ స్వచ్ఛంద సేవతో స్పర్శించిన జీవితాల కారణంగా లక్షలాది మందికి ఆరాధ్యురాలు అయ్యారన్నారు. మానవత్వానికి మించిన సంపద లేదు, మనిషి ఔన్నత్యానికి కొలబద్ద మేధస్సు కాదు, హృదయమని ప్రపంచానికి చాటి చెప్పిన మహోన్నత మహిళ మదర్ థెరిస్సా అన్నారు. మదర్ థెరిస్సా సేవలు గుర్తించి నోబెల్ బహుమతి అందజేశారన్నారు. ఈ సందర్భంగా థెరిస్సా చిత్రపటానికి నివాళులర్పించారు. మైలవరంలో మదర్ థెరిస్సాసా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ కో ఆర్డినేటర్ వంగూరు రమేష్ బాబు థెరిస్సా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో లకిరెడ్డి రవీంద్రరెడ్డి, గంటా రాము తదితరులు పాల్గొన్నారు.

పెనుగొలనులో నివాళి

పెనుగొలను(గంపలగూడెం): భారతరత్న మదర్ థెరిస్సా జయంతిని గంపలగూడెం మండలం పెనుగొలనులో షిర్డీసాయిబాబా సేవాకమిటీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎలిమెంటరీ పాఠశాలలో థెరిస్సా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఈసందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ అనాథలకు, పేదలకు, మరణశయ్యపై ఉన్న వారికి మదర్‌థెరిస్సా చేసిన సేవలు ఎనలేనివన్నారు. నోబుల్‌శాంతి, భారతరత్న పురస్కారాలు ఆమె సేవలకు నిదర్శనం చెప్పారు. సేవాకమిటీ సభ్యులు పి.కృష్ణ, ఉపాధ్యాయులు పి.రవికుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

తిరువూరులో జయంతి

తిరువూరు: నోబెల్ శాంతి బహుమతి అవార్డు గ్రహీత మదర్ థెరిస్సా జయంతిని తిరువూరు ఆర్టీసీ బస్టాండులో ఆర్.ఎస్. ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. 100 మంది పేదలకు దాతల సహకారంతో అన్నదానం చేసినట్లు ఫౌండేషన్ నిర్వాహకులు రేష్మా తెలిపారు. కార్యక్రమంలో విజయవాడ దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థాన పాలకమండలి సభ్యులు దేవిశెట్టి బాలకృష్ణ, వాసవీక్లబ్ అధ్యక్షుడు దోసపాటి రవికుమార్, ఆర్యవైశ్య సమాజం అధ్యక్షుడు గుడిమెట్ల మురళి పాల్గొన్నారు.

ఘనంగా గిడుగు జయంతి



మైలవరం: తెలుగు భాషకు వన్నె తెచ్చిన పితామహుడు గిడుగు రామ్మూర్తి అని ప్రధానోపాధ్యాయుడు పి.గోపాల్ తెలిపారు. మైలవరం 6వ వార్డు ఎంపీపీ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు గోపాల్ ఆధ్వర్యంలో గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి కార్యక్రమంలో భాగంగా శనివారం పద్యాల తోరణం నిర్వహించారు. తెలుగు భాషను వాడుకలోకి తీసుకువచ్చిన పితామహుడు గిడుగు అన్నారు. తెలుగు భాషాభివృద్ధికి ఆయన చేసిన సేవలు ప్రశంసనీయమన్నారు. మనం అందరం తెలుగు భాషను బాగా నేర్చుకోవాలని, తెలుగు భాష సంస్కృతి, సంప్రదాయాలకు పునాది భాష మూలాధారంగానే మన రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌గా ఏర్పడిందన్నారు. తెలుగు భాషను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మస్తాన్‌రావు, శ్రీలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిశ్రమలను ప్రోత్సహించాలి



వేదాద్రి(జగ్గయ్యపేట): పరిశ్రమల రంగానికి ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యం ఇస్తోందని ప్రజలు కూడా గ్రామాల్లో పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహించాలని జిల్లా రెవెన్యూ డివిజనల్ అధికారి మోహన్‌కుమార్ పేర్కొన్నారు. గ్రామంలో ఏర్పాటు చేయనున్న కామ్య ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్‌పై శనివారం కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్లాంట్‌లో ఆస్బెస్టాస్, నాన్ ఆస్బెస్టాస్ ప్లాట్ సిమెంట్ షీట్లు తయారు చేయనున్నట్లు పేర్కొన్నారు. రూ. 30 కోట్ల వ్యయంతో కంపెనీని స్థాపిస్తున్నారని తెలిపారు. రావిరాల, జయంతిపురం, పోచంపల్లి, మాదిపాడు, గుండబోయినపాలెం ప్రాంతాల్లోని నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. కాలుష్య నియంత్రణ మండలి నిబంధనల మేరకు కంపెనీని నిర్వహించాలని చెప్పారు. కాలుష్య నియంత్రణ మండలి ఈఈ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజల నుంచి, పర్యావరణ వలంటీర్ల సూచనలను కేంద్ర కాలుష్య నియంత్రణ మండలికి పంపనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్లాంట్ టెక్నికల్ కన్సల్టెంట్ భాస్కరరావు, తహసీల్దార్ చిన్నారావు, డీటీ నాగరాజు, సర్పంచ్ గుడారు పేరయ్య, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ మండవ శ్రీనివాసగౌడ్, నాయకులు స్వామి, వైకుంఠరావు, రాము పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న ఎంపీపీ మెర్సీవనజాక్షి, సర్పంచ్ నాగమల్లీశ్వరి తదితరులు

విస్సన్నపేట: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సచివాలయాలకు మంజూరైన నిధులతో సీసీ రోడ్డు ఏర్పాటుకు శనివారం భూమి పూజ నిర్వహించారు. మూడో సచివాలయం పరిధిలో స్థానిక ఆర్యవైశ్య కల్యాణమండపం పక్క వీధిలో సీసీ రోడ్డు ఏర్పాటుకు ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి, సర్పంచ్ సాధుపాటి నాగమల్లీశ్వరి పూజలు చేసి పనులను ప్రారంభించారు. విస్సన్నపేటలో నాలుగు సచివాలయాల పరిధిలో సీసీ రోడ్డు నిర్మాణం పనులు చేపట్టామని సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రెడ్డి శ్రీనివాసరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు నెక్కళపు కుటుంబరావు, ఏఎంసీ డైరెక్టర్ రెడ్డి శేషగిరి, నాయకులు కోటా పుల్లారావు, కోటా శ్రీనివాసరావు, పిల్లి రాజేష్, సాధుపాటి కోటేశ్వరరావు, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

మల్లేలలో పనుల ప్రారంభం

మల్లేల(తిరువూరురూరల్): మండలంలోని మల్లేలలో గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో చేపట్టిన సీసీ రహదారుల నిర్మాణ పనులను సర్పంచ్ వంగూరు మరియమ్మ శనివారం ప్రారంభించారు. రూ.20 లక్షలతో గ్రామంలో రహదారులు, డ్రెయినేజీల నిర్మాణం చేపట్టామని సచివాలయ కార్యదర్శి అంజనాదేవి తెలిపారు. పీఏసీఎస్ చైర్మన్ కలకొండ రవికుమార్ పాల్గొన్నారు.

కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు రూ.5 లక్షల చేయూత



లెటర్ ఆఫ్ క్రెడిట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే వసంత

జి.కొండూరు: కిడ్నీ వ్యాధి బాధితుడికి ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్ చేయూతనిచ్చారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే కవులూరు గ్రామంలో ఇటీవల పర్యటించిన సమయంలో కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న తొండెపు వెంకటసత్యానారాయణకు(సతీష్) కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ అవసరమని తెలుసుకున్నారు. కిడ్నీ ఇచ్చేందుకు సత్యానారాయణ తల్లి సిద్ధంగా ఉన్నప్పటికీ వైద్య ఖర్చులు భరించే స్తోమత ఆ కుటుంబానికి లేదని తెలుసుకున్న ఎమ్మెల్యే, ప్రభుత్వం నుంచి రూ.5 లక్షలను మంజూరు చేయించారు. కాగా ఈ నగదుకు సంబంధించిన లెటర్ ఆఫ్ క్రెడిట్‌ను ఎమ్మెల్యే చేతులమీదుగా బాధితుడికి శనివారం అందజేశారు. కార్యక్రమంలో కవులూరు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను సక్రమంగా చేపట్టాలి



నారికింపాడులో ఓటర్ల జాబితాను పరిశీలిస్తున్న తిరువూరు ఆర్డీఓ ప్రసన్నలక్ష్మి

వినగడప/నారికింపాడు(గంపలగూడెం): ఎన్నికల కమిషన్ ఆదేశానుసారం ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను సిబ్బంది సక్రమంగా, ఎలాంటి అవకతవకలు లేకుండా చేపట్టాలని తిరువూరు ఆర్డీఓ వైవీ ప్రసన్నలక్ష్మి తెలిపారు. గంపలగూడెం మండలం వినగడప, నారికింపాడు గ్రామాల్లో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను ఆర్డీఓ శనివారం పరిశీలించారు. నూతన ఓట్ల నమోదు, తప్పులు సవరణ, అడ్రస్ మార్పు, తొలగింపుల, కార్డుల్లో తప్పుగా నమోదైన ఫొటో సవరణ విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సవరణ విషయమై ప్రతి ఓటరును ప్రత్యక్షంగా కలిసిన తర్వాత మాత్రమే తదుపరి చర్యలు తీసుకోవాలన్నారు. అర్హులందరికీ ఓటు హక్కు ఉండేలా సిబ్బంది కృషి చేయాలన్నారు. ఒక వ్యక్తికి రెండు చోట్ల ఓటు ఉంటే ఎక్కడ తొలగించాలన్నది ఓటరుకే నిర్ణయించుకోనే అధికారం ఉందని చెప్పారు. వినగడప పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి, వీఆర్వోఓలు దుర్గారావు, గౌరసాని ప్రభాకర్‌రెడ్డి, ఆవుల మూర్తి, శ్రీధర్, బీఎల్వోలు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో రక్తహీనత నివారణ



ములగలమ్మ సూరవరం హైస్కూల్‌ను సందర్శించిన డీఎల్పీవో సుందరి

నూజివీడు: గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు రక్తహీనత నివారణకు పౌష్టికాహారం, ఆకుకూరలు తప్పని సరిగా తీసుకోవాలని డీఎల్పీవో సుందరి అన్నారు. ఆగిరిపల్లి మండలంలోని పలు గ్రామాల్లో శనివారం నూజివీడు డీఎల్పీవో సుందరి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ముందుగా సూరవరం సచివాలయాన్ని సందర్శించి సిబ్బంది పనితీరును పరిశీలించడంతో పాటు కార్యాలయ రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం కొమ్మూరులోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి ఎత్తు, బరువు తక్కువగా ఉన్న పిల్లలను, రక్త రక్తహీనత నివారణపై గర్భిణులను, బాలింతలకు తగిన సూచనలు చేశారు. కొమ్మూరులో గర్భిణుల ఇంటికి వెళ్లి రక్తహీనత నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఎంపీయూపీ స్కూల్‌ను సందర్శించి కిశోర బాలికలకు రక్తహీనత- నివారణ, పౌష్టికాహార ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. అనంతరం ములగలమ్మ సూరవరంలోని జెడ్పీ హైస్కూల్‌ను సందర్శించి అక్కడ డ్రాపవుట్స్ జాబితాను సేకరించి వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. పిల్లలను తప్పనసరిగా పాఠశాలలో, కళాశాలలో చేర్పించాలని సూచించారు.

విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలి



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న ఏసీపీ రమేష్, సీఐ మోహన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ అప్పారావు

మైలవరం: విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలని మైలవరం అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఎం.రమేష్ తెలిపారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు యాంటీ ర్యాగింగ్‌పై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఏసీపీ రమేష్ మాట్లాడుతూ.. విద్యార్థులు యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో మెలిగి మొదటి సంవత్సరం విద్యార్థులతో చెడుగా ప్రవర్తించకుండా ర్యాగింగ్ కార్యక్రమాలకు దూరంగా ఉండాలన్నారు. అలాగే అందరితో కలిసి మెలసి ఉండాలని, విద్యార్థులు తాము ఎంచుకున్న విభాగంలో కష్టపడి, ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. తల్లిదండ్రులు, కళాశాలకు మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలన్నారు. విద్యార్థినులతో సోదర భావం కలిగి ఉండాలని, డ్రగ్స్, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అప్పారావు మాట్లాడుతూ ర్యాగింగ్ నేరమని, ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ర్యాగింగ్ ఫ్రీ కళాశాలగా పేరు తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా యాంటీ ర్యాగింగ్‌పై వ్యాస రచన, పోస్టర్ ప్రజంటేషన్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సీఐ మోహన్‌రెడ్డి, ఎస్ఐ హరిప్రసాద్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.హరినాథరెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ బి.శివహరిప్రసాద్, యాంటీ ర్యాగింగ్ సెల్ ఇన్‌చార్జి శీలం శ్రీనివాసరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు వ్యాయామోపాధ్యాయులకు స్కూల్ కాంప్లెక్స్

నూజివీడు: నియోజకవర్గంలోని వ్యాయామోపాధ్యాయులకు ఈనెల 28న నూజివీడులోని డీవైఈఓ కార్యాలయ సమావేశ మందిరంలో స్కూల్ కాంప్లెక్స్ నిర్వహిస్తున్నట్లు డీవైఈఓ ఎం.సేవియా శనివారం తెలిపారు. నూజివీడు, ముసునూరు, ఆగిరిపల్లి, చాట్రాయి మండలాల్లోని వ్యాయామోపాధ్యాయులు పాల్గొనాలని సూచించారు. ఇందులో పలు ఆటలు, క్రీడల్లో మెలకువలు, రోజువారీ కార్యక్రమ నిర్వహణను వివరిస్తారని డీవైఈఓ తెలిపారు.

వివేక్‌కు ఘన సన్మానం



నూజివీడు: ఆగిరిపల్లి మండలం పోతవరప్పాడుకు చెందిన మంద ప్రభాకర్, లక్ష్మీ దంపతుల కుమారుడు వివేక్ 529 మార్కులతో ఓపెన్ కేటగిరీలో ఎంబీబీఎస్ సీటు సాధించి కాకినాడలోని రంగరాయ మెడికల్ కాలేజీలో అడ్మిషన్ పొందిన సందర్భంగా గ్రామస్తుల ఆధ్వర్యంలో శనివారం అభినందన సభ నిర్వహించారు. ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు చౌటపల్లి సురేష్ కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాదిగ రాజకీయ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కంబాల ప్రదీప్, నూజివీడు ఇన్‌చార్జి కలపాల జోజి, కలపాల సురేష్, మల్లాది ప్రసాద్‌రావు పాల్గొని వివేక్ తల్లిదండ్రులను సత్కరించారు. ఈ సందర్భంగా ఎంఈఓ-2 ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ సాధారణ కుటుంబానికి చెందిన వివేక్ మెడికల్ సీట్ సాధించడం అభినందనీయమన్నారు. గ్రామంలోని ప్రతి విద్యార్థి వివేక్‌ను ఆదర్శంగా తీసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. విస్సన్నపేటకు చెందిన కుమార్ ఎడ్యుకేషనల్ సొసైటీ అధినేత అప్పికట్ల కుమార్ మాట్లాడుతూ ఎంబీబీఎస్ తర్వాత పీజీ పూర్తి చేసి పేదలకు ఉచిత వైద్యాన్ని అందించాలని కోరారు.

మహిళలు వృత్తి నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

తిరువూరు: మహిళలు జీవనోపాధి కోసం చేపట్టే వృత్తిలో నైపుణ్యాలు పెంపొందించుకోవాలని తిరువూరు నగరపంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి అన్నారు. నగర పంచాయతీ కార్యాలయం ఎదుట మెప్మా ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన అర్బన్ మార్కెట్‌ను ఆమె సందర్శించారు. మార్కెట్‌లో నెలకొన్న పోటీలో అర్బన్ మార్కెట్ స్టాల్స్‌లో లభ్యమయ్యే వస్తువులు త్వరగా అమ్ముడుపోయే విధంగా మెప్మా సభ్యులు కృషిచేయాలని సూచించారు. ఆర్థికాభివృద్ధి చెందాలని చెప్పారు. కార్యక్రమంలో మెప్మా సీవో ప్రసాద్, టీఎల్ఎఫ్ సభ్యులు పాల్గొన్నారు.